# కిసాన్ కా కిస్సా

ఉన్నట్టుండి రామన్న నేలమీద కుప్పకూలాడు. అదిచూసిన ప్రక్కనున్న వాళ్ళు లేపి కూర్చోబెట్ట చూసారు. కాని కూర్చోలేక అట్లానే నేలమీద చతికిలపడ్డాడు. నీళ్ళు తెచ్చి ముఖంమీద చల్లారు. కళ్ళు తెరిచాడు. మాటలు రావడంలేదు. నీళ్ళు తాప చూశారు కాని తాగలేదు. చుట్టు చేరిన నలుగురు మాట్లాడుకుని, బండి కట్టి బండిమీద గడ్డి, దానిమీద దుప్పటి పరిచి, నలుగురు ఎత్తి బండిమీద పడుకోబెట్టుకుని పక్కఊళ్ళోవున్న దావఖానకు తీసుకెలతువుంటె ఊరు ఊరంతా కదిలొచ్చి ఊరి బయటి వరకు సాగనంపారు. భార్య రంగమ్మ కొడుకు మరో ఇద్దరు బండిలోవున్నారు. భార్య రంగమ్మ శోకాలు పెట్టి ఏడుస్తున్నది. కొడుకు బిక్కుబిక్కుమంటు దు:ఖాన్ని మింగుతు కాళ్ళ దగ్గర కూర్చున్నాడు. బండి ఊరుదాటి రొడ్డెక్కింది. ఎదురైన ప్రతీ ఒక్కరు రాములుకు వచ్చి న ఆపద గురించి అడిగి తెలుసుకుంటున్నారు. ఓ బరువైన శ్వాస వదులుతూ కదులుతున్నారు. భార్య శోకాన్ని చూసిన ఆడవాళ్ళు దు:ఖపురీతులౌతున్నారు.

"ఎందుకో రామన్న ఒక్కసారె ఇట్లా అయిపాయె" అన్నాడు బండిలోనే వున్న రుక్కయ్య.

"ఎవడన్న చేతబడిచేయలేదుకదా?" అన్నాడు ముగ్గురిలో ఒకడు రాజయ్య.

"ఎవనికేంపాపం చేసినం దేవుడో" అని ఏడుస్తుంది భార్య. ఆమె ఏడుపును విని బాటన పోయేవాళ్ళు మళ్ళీ మళ్ళీ చూస్తువున్నారు. పల్లెల్లో ఏది జరిగినా నడిచేవాళ్ళు, ఆగి, విషయం తెలుసుకుని మరీ కదులుతారు.

"ధావఖానకు పోతున్నంగ అక్కడ చెపుతరు" అన్నాడు రామన్న కొడుకు పాతికేండ్ల శీను.

"దగ్గర, దగ్గర అరవై ఏండ్లు కాపసున్నయి. ఎన్నడూనొప్పి ఎరుగడు. ఓ జ్వరం రాలేదు దేవుడా" అంది భార్య ఏడుస్తూనే.

"మనిషికి రావడం ఎంతసేపు మంచిగుంటనే మనిషి" అన్నాడు బండితోలె ఎంకులు. రామన్న కళ్ళు తెరిచేవున్నాయి.రెప్పలు నిలబడిన చూపు తప్పింది. శ్వాస పీలుస్తూనే వున్నాడు కాని మాటలేదు. చేతులను పైకిలేపితే లేచి తిరిగి కిందికి జారిపడిపోతున్నాయి. కాళ్ళు అంతె. ప్రాణం వున్న శవం లాగున్నాడు. పడుకోబెట్టినప్పుడు ఎట్లా పడుకో పెట్టారో అట్లాగే కదలికలు లేకుండా

ఉండిపోయాడు. ఒకటే మూల్గుడు.

అది ఏరియా ధావాఖాన. జనంతో కిటకిటలాడుతువుంది. అప్పుడే యాక్సిడెంట్ కేసొచ్చింది. ఓ వ్యక్తికి కాళ్ళు ఇరిగినట్టుంది. ఆయన తాలూకు మనుషులు ఎదబాదుకుంటు ఏడుస్తున్నారు. బన్ రొట్టెల ట్రేతో ఓ కుర్రాడు అటు ఇటు తిరుగుతు వున్నాడు.

బండి దావఖానముందుకొచ్చింది. గేటు పక్కకు బండి ఆపి రామన్నను నలుగురు ఎత్తుకొని లోపలికి తీసుకెళ్లారు. డ్యూటీ డాక్టర్ తన రూమ్‌లోనే వున్నారు. ఆయన ముందు ముగ్గురు హౌజ్ సర్జన్లు రోగాల గురించి చర్చిస్తు వున్నారు. వార్డుబోయ్ "కేసొచ్చింది సార్" అని చెప్పి ఓ.పి. వైపు మళ్లాడు.

"పదండి చూద్దాం" అని లేచాడు డ్యూటీ డాక్టరు రావు. అందరు ఓ.పి. చేరారు. రామన్నను బల్లమీద పడుకోబెట్టారు. డాక్టర్‌ను చూడగానే రంగమ్మ గొల్లుమంది. అది చూసి 'ఏడవద్దు' అని సైగ చేసాడు వార్డుబోయే.

"ఎప్పటి నుండి ఇట్లా వుండడం" అని అడిగాడు డాక్టర్.

"పొద్దు నెత్తిమీదికి వచ్చినుండి" అంది బార్య కళ్ళను కొంగుతో అద్దుకుంటు ముక్కు పీల్చుతు.

"ఏమన్న తిన్నాడా?" అడిగాడు డాక్టర్. అతని కడుపును వొత్తి చూస్తు.

"గంజి తాగాడు" అని చెప్పింది భార్య.

"పురుగెమన్న ముట్టిందా" అడిగాడు డాక్టర్ అతని కనురెప్పలను విప్పి పెద్దవిచేసి చూస్తు.

"అట్లేమి చెప్పలేదు. ఎక్కడా కరిచిన గుర్తులు లేవు" అన్నాడు కొడుకు శీను. అతని ముఖంలో దుఃఖం పరుచుకొని వుంది.

"నురుగులు ఏమన్న వచ్చినయా?" డాక్టర ప్రశ్న.

"అట్లకూడ ఏం లేదు. ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు" అన్నాడు శీను.

జూనియర్స్ వైపు మళ్లి "మొదట ఈయనకు స్పృహ రావాలంటె ముందు సలాయిన్ ఎక్కించాలి. ఏయ్ బోయ్ సలాయిన్ ఏర్పాటు చేయి" అని చెప్పి డాక్టర్ వెళ్లి సీట్లో కూర్చొని, ఇన్ పేషంట్‌గ వివరాలను నమోదు చేసుకున్నాడు.

ఓ.పి.లోనే ఓ పక్కకు సలైన్ ఎక్కించే ఏర్పాటు చేసాడు వార్డుబోయ్. సలైన్ ఎక్కుతువుంది. పక్కన బార్య కొడుకు నిలుచున్నారు. వెంట వచ్చినవాళ్ళకు వార్డుబోయ్ లోపలికి రావద్దని చెప్పగ, వాళ్ళు గదిబైటే వున్నారు. డాక్టర్ ఎదురుగా వున్న వాళ్లలో మూర్తి, సలీం, రెడ్డి, డాక్టర్ వాళ్ళ వైపు చూసి

"ఈకేసు ప్రత్యేకమైంది. ఇట్లాగే అతను పోతే జనం చేతబడి జరిగింది అనుకుంటారు. హార్ట్ ఫేల్యూర్, అప్పెండిసైడ్ మరణాలన్నీ గ్రామీణ జనం చేతబడి అనె సర్దుకపోతారు" అన్నాడు డాక్టరు.

"ఈయన పల్సు బాగనే ఉన్నవి సార్" అన్నాడు జూనియర్ డాక్టర్ మూర్తి.

"ఒకవేళ్ల అప్పెండిసైడ్ అందామ అంటే కడుపునొప్పి వున్నట్టు లేదు" అన్నాడు రాజు. రామన్న బార్య కొడుకు జూనియర్స్ దగ్గరె వున్నారు. డాక్టర్ కేసు షీట్ రాసి, దానిమీద చేయవల్సిన పరీక్షలన్నీ జరగాలి అని జూనియర్స్ కిస్తు " ఈపరీక్షలన్నీ జరిపి కేసు ఏమిటో తేల్చండి. నాకు ఓ చిన్న మీటింగు వుంది. అటెండ్ అయి వస్తాను" అంటు కదిలి వార్డు బోయ్‌ను పిలికి "డాక్టర్స్ ఏది కావాలంటె అది అరేంజ్ చేయి. ల్యాబ్ వాళ్లందర్ని వుండమని చెప్పు. అతను మాట్లాడితే మాట్లాడించి ఆయన బాధలకు కారణాలను అడిగి తెలుసుకొని ఓ సమగ్రమైన రిపోర్టు తయారుచేయండి. మీకో మంచి ప్రాక్టికల్ రోగి దొరికాదు కానియండి. స్పృహ వచ్చినాక వార్డుకు తీసుకెళ్లండి వస్త" అంటు బయటికి నడిచాడు. చాయ ఫ్లాస్కుతో ఎదురైన కుర్రాడు డాక్టర్‌ను చూసి వరండా వైపు నడిచాడు.

జూనియర్ డాక్టర్లు ముగ్గురు మూడు షీట్స్‌ను తీసుకున్నారు. ఒకరు లోపలి అవయవాలు, మరొకరు కాళ్లు చేతులు ఇంకొకరు ముక్కు, నోరు, కళ్లు చెవులు పరీక్షించారు. రెండు గ్లూకోజ్ బాటిల్స్ ఎక్కినాక రాములు కదిలి అటు ఇటు చూసాడు. ఆయన్నీ మెడికల్ వార్డ్‌లోకి తీసుకెళ్లారు.

మెడికల్ వార్డంతా రోగులతో నిండి వుంది. మంచాల పక్కన వాళ్ల వాళ్ల తాలూకు మనుషులున్నారు. ఎవరి ముఖంలోను కళాకాంతులు లేవు. దగ్గుతు, గునుస్తు మంచాల మీద రోగులు. మొదట ఎక్స్‌రేలు తీయించి పరిశీలిస్తున్నాడు. రెడ్డి. అలాగే మరో డాక్టర్ మూర్తి స్కానింగ్ ముందుంచి లోపల అవయవాల పనితీరును పరిశీలించి, ఇ.సి.జి. మిషన్ ఆన్ చేశాడు. ఆ తరువాత కళ్లు ముక్కు చెవులు పరిశీలించాడు. సలీం స్కానింగ్ రూంలోకి తీసుకెలుతు వార్డుబోయ్‌ను పిల్చి "బ్లడ్ యూరిన్ తీసుకొని ల్యాబ్‌లో ఇవ్వు" అన్నాడు రాత్రి వరకు అన్నీ పరీక్షలు ఓ ప్రముఖ వ్యక్తికి జరిగే పద్దతిలో జరిగిపోయాయి. కారణం హౌజ్ సర్జన్లకు ఆ మామూలు వ్యక్తి ఓ సబ్జెక్టు కావడమే! ఆ తరువాత ఆ వ్యక్తికి స్పృహ వచ్చింది. డాక్టర్లు అడిగే ప్రశ్నలకు తనకు తోచింది చెపుతు వచ్చాడు వాళ్లు రికార్డు చేసుకుపోతువున్నారు. ముగ్గురు తేల్చిన నిర్ణయాలను కలిపి ఓ సమగ్ర రిపోర్ట్‌గా సీనియర్ డాక్టర్ వచ్చేవరకు

సిద్దంచేశారు.

నర్సులు డ్యూటీ మారుతున్నట్టుంది. విజిటర్స్ సందడేసందడి. షుగర్ లేదు మనిషి వుండవలసిన బరువు లేదు. ఎక్కువ బి.పి. వుంది. అమాయక ప్రాణికి ఏమి టెన్షన్ వుండబ్బా అనుకుంటు చేతులను చేతివేళ్లను చూశాడు రెడ్డి. ఎడమ చేతి చూపుడు వేలుకు ఓ నల్ల చుక్కుంది. ఇదేమిటి అని అడిగితె "ఓటు వేస్తే పెట్టిన గుర్తు. ఎన్నికలపుడు అన్నీ పార్టీలవాళ్లు గుడిసెచుట్టు తిరిగి అది చేస్తం ఇది చేస్తం అని బుదగరించి ఓటేసినాక ఆపదొస్తే ఒక్కరు కనిపించరు కాని చుక్క మాత్రం నెలరోజుల వరకు కనిపిస్తది" అంది బార్య

"లోకంలో ఏం పాపం పెరిగిందో ఏమో తండ్రి పుట్టి బుద్దెరిగిననుండి ఎన్నడింత కరువు ఎరగం. ఎట్లా బతికేది ఈ లోకం మునిగిపోతదా తండ్రి. కష్టం చేసుకుని బతికెటోనికి గండమొచ్చే. జర మావోన్ని గట్టెక్కియ్యండ్రి తండ్రి" అంది రంగమ్మ రెండు చేతులను ఒక్క దగ్గరుంచి దొసిలిపడుతు.

" పండించే రైతే అడ్డంపడితె జనానికి తిండెట్లా? ఆయన్ను తప్పక బతికీయాలా" అన్నాడు రెడ్డి.

"నాగలెమ్మటి నడిచి నడిచి అరిగిపోయిన కాలిగోళ్లు మేడి పట్టడంవల్ల కాయలు కాసిన అరచేతులు" అన్నాడు మళ్లీ రెడ్డి. రెడ్డిది వ్యవసాయ కుటుంబం కనుక వ్యవసాయంలోని సాదక బాదకాలు తెలుసు.

మూర్తి సలీం ఆలోచనలో పడ్డారు.

"మీ బాధలు కాదనము. సూస్తున్నాంగ కాస్త ఆగు" అన్నాడు రెడ్డి.

"ఈయన చాల టెన్షన్‌లో వున్నాడు, బి.పి. ఎక్కువగా వుంది. ఈయనకు ఇంతా బి.పి. ఎందుకు వస్తది అన్నాడు" సలీం రెడ్డి వైపు మళ్లి.

"అట్లా ఎందుకుందమ్మ" అని భార్యవైపు చూశాడు డాక్టరు మూర్తి.

"ఆయనకు ఎన్నడు నిమ్మలం వుంది "పొద్దునలేస్తే వానకెదురు చూపేనాయే, పంటలు ఫిఖరేనాయె. గొడ్లకు మేతలేదని, రోగాలు నొప్పులు, చేసిన అప్పులు ఎట్లా తీర్చాలని "ఒక్కటా వీటికి తోడు ఈగలు దోమలు కూడా చావని మందులతో చేలకొచ్చిన రోగాలు తగ్గక పంట దిగుబడి రాకపోవటం" మిడత కొట్టుడని, ఏరు పురుగులని, ఆకు పురుగులని ఎన్నీ రకాల నష్టాలు బాధలు, ఇవన్నీ రోగాన్ని పెంచుతాయా తండ్రి" అని అడిగింది రంగమ్మ అమాయకంగా వార్డులోని మిడ్‌వైఫ్‌లు ఆమె వైపే చూస్తున్నారు.

"అంటె తినె తిండిని ఇన్నిటినుండి కాపాడాలన్నమాట" అన్నాడు సలీం

పంటల ఎలా పండిస్తారో సలీంకు తెలియదు. హైద్రాబాదులోని పాత బస్తిలో పుట్టి పెరిగి పట్టణంలోనె చదువుకున్నాడు. కాకపోతె టి.వి.లో దమ్ము చేయడం, మందులు పిచికారి చేయడం చూడొచ్చు.

"అరె రెడ్డి తిండి గింజలనక ఇంత కథ వుందే కెమికల్స్‌తో తిండి గింజలను కూడ సృష్టించుకుంటే పోలే" అన్నాడు సలీం మళ్లీ తానె.

"కాని పని, గింజలను పుట్టించాలంటే మూల పదార్థం మళ్లీ గింజలేకావాలి" అన్నాడు రెడ్డి

"మన తిండి రూపంలో వస్తున్న రొట్టె, బిస్‌కిట్ గోదుమల రూపాంతరమే అంటే మనం గోదుమల పండించాల్సిందేకదా" అన్నాడు రెడ్డి సలీం అర్థమయ్యేటట్టు. ఓసారి మెడిసిన్ ఫస్టు ఇయర్‌లో తనతో బియ్యం చెట్టుకు కాస్తయి, అన్న విషయం గుర్తొచ్చింది.

"పండించడం అంటే మళ్లీ నారు, నీరు ఏత, కోత ఇవన్నీ జరగాల్సిందేనన్నమాట?" అన్నాడు సలీం ఇప్పుడర్థమైందన్నట్టు చూస్తు.

ఆస్పత్రి వెనుక వున్న క్యాంటీనులో రోగుల కోసం అన్నం కూరలు వండుతున్న వంటకాల వాసన వస్తువుంది.

సీనియర్ డాక్టర్ రావు. తన రూంకు రాగానే ఆ రిపోర్ట్సును ఆయన టేబుల్ ముందుంచి, చుట్టు కూర్చున్నారు.

ఎక్స్‌రే ఫిల్మ్‌ను స్క్రీన్ మీదుంచి డాక్టర్‌కు చూపిస్తు

"సర్ ఈయన మోకాళ్ల చిప్పలు అరిగిపోయినయి. చేతుల పాదాలలోని వేళ్లకీళ్లు అరిగిపోయినయి. అందుకే కీళ్ల దగ్గర నొప్పులు అంటున్నాడు. ఇకపోతె ఈ వెన్నెముకను చూడండి. మధ్య మధ్య పూసలు అరిగిపోయి వున్నవి. మెడ దగ్గర వెన్నెముఖ వంగి వుంది" అన్నాడు.

"అవును రెడ్డి రైతు దేశానికి వెన్నెముక అంటారుగ మరి ఈయన వెన్నెముక ఇట్టుందేమిటి?" అన్నాడు సలీమ్ ఎప్పుడో చదివింది గుర్తొచ్చి.

"బాగా బరువులు మోయడం వల్ల వంగి, పనిచేస్తూ వుండడం వల్లా అరిగి వెన్నెముక ఇట్లా తయారు అవుతుందేమో. వ్యవసాయ పనులు చేసే ప్రతి మనిషి ఎముకలు ఇలాగే అరిగిపోతాయా? సర్" అన్నాడు మూర్తి.

"అంతేగ, పోగా శ్రమించే వాళ్ల నరాలలో సత్తువా తగ్గి, కరిలేని పురికోసలాగ మారుతాయి. వృద్ధాప్యంలో కూర్చొంటె లేవరు, లేస్తె కూర్చోలేరు చూడండి ఈ ఎముకల్లో వుండే మూలిగ కరిగిపోయి ఘన రూపం

కోల్పోయింది" అని చూపించాడు డాక్టరు రావు.

"అవును సార్ వాళ్లు అంటు వుంటారు కష్టించి కష్టించి ఎముకల్లో మూలిగ కరిగిపోయిందని" అన్నాడు మూర్తి. రెడ్డి ఈసిజి కొలెస్ట్రాల్ సంబంధించిన రిపోర్ట్సును ముందుంచగ, "ఈసిజి రిపోర్ట్స్ ఒకె నార్మల్ కొలస్ట్రాల్ నార్మల్" అన్నాడు డాక్టరు రావు.

"అవును తిండె సరిగాలేని వాడికి కొలెస్ట్రాల్ ఎట్లుంటుంది. కిడ్నీ, లివర్ రిపోర్ట్ బాగానే వున్నాయి అన్నీ నార్మలే" మరో ఆకరి ఎక్స్‌రేను తీసుకొని పక్కనె వున్న స్క్రీన్ మీద చూస్తువున్నారు.

"సర్ ఈయన వేగులు దగ్గర్కి ముడుచుకుపోయి ఉన్నాయి ఎందుకో అన్నాడు" మూర్తి.

"తిండి సరిగ తినక ఇట్లా అయిపోతయి" అన్నాడు డాక్టర్ రావు.

"ఈయన పండించేవాడే కదా ఎందుకు అట్లా?" అని అడిగాడు సలీం.

"ఆ విషయం అడిగితే ఏమన్నడు" రిపోర్ట్‌ను టేబిల్‌మీద వుంచుతు అడిగాడు డాక్టర్ రావు,

"మొదట మాట్లాడలేదు కాని ఆయన కళ్లు తడి అయ్యాయి సర్ అప్పుడెందుకో నా మనస్సు కదిలింది సార్" అన్నాడు సలీం మరొకసారి ఆయన మనస్సు కరిగిపోయింది.

రామన్న కళ్లలో తన బాదలు కదులుతు వున్నాయి.

"ఉన్న భూమిని సాగుచేయడం వల్లా చాలా అప్పులైనయి. అప్పు తీర్చడానికి రాత్రింపగలు కష్టపడి పండించి, అప్పుల వాళ్లకు అప్పచెప్పి వట్టి చేతులతో ఇంటికి రావడం. ఓ ఐదేండ్ల నుండి వర్షాలు పడక బావులెండిపోగ ఉన్నదానిలో కొంత అమ్మి బోర్లు ఏయిస్తే వాటిల్లోను నీళ్లు పడకపోవటం, మెట్ట పంటల సంగతి అంతే ఏదో కార్తిలో వర్షాలు పడితే విత్తనాలు వేస్తే తరువాత కార్తుల్లో వర్షాలు రాక మొలకలె ఎండిపోవటం. ఒకవేళ్ల బతికినా ఏదో తుఫాను వల్ల వర్షాలు పడి చెలుకలు జాలుపారి నీరసిచ్చి చేనంతా పాడైపోవటం. ఇంకా ఇంకా బాధలన్నీ గుర్తు రాసాగినయి. అప్పు పెరుగుతూనే వుండడం, పాలు పెరుగుకోసం బర్రెను సాదితె అది గడ్డి గాదం దొరకక పాలు ఇవ్వటం మానటం అన్నీ గుర్తొచ్చి కళ్లు మూతలు పడి వళ్లు తూలి మంచం మీది నుండి కిందపడి పోయాడు. అది చూసి అక్కడున్న వాళ్ళు లేవనెత్తి మంచం మీద పడుకోబెట్టారు. బార్య ఏడుస్తు తలను మంచానికి అదిమి పట్టింది. శీను పాదాలను అది పట్టుకున్నాడు.

"ఓసారి పేషంట్‌ను చూద్దాం పదండి" అంటు డాక్టర్ రావు జూనియర్స్ అతన్ని వుంచిన మెడికల్ వార్డులోకి నడిచారు. అతను కళ్లు తెరిచి పై కప్పు వైపు చూస్తున్నాడు. మంచం పక్కన సలైన స్టాండు వుంది. ఇంకా సలైన్ ఎక్కిస్తూనే వున్నారు. బార్య ప్రక్కన్నె నిలుచున్న డాక్టర్ల రాకను చూసి చేతులు జోడించి నమస్కరించింది. మంచం మీది నుండి పడిన విషయం చెప్పింది. "ఏమమ్మా ఎట్లుంది" అంటు రోగి చేయినందుకొని నాడిని చూసి, కనుబొమ్మలు కదిలిస్తు బి.పి. ఆపరేటర్ ఇటు పట్టుకరా" అని నర్స్ వైపు చూస్తు అన్నాడు. ఆమె బి.పి. ఆపరేటర్‌ను తెచ్చి దండరెక్కకు అమర్చి నిలుచుంది.

రెడ్డి బి.పి.ని చూసి "చాల ఐ. బి.పి. వుంది సార్" అన్నాడు.

"అందుకే ఎగిరిపడ్డాడు ఇంత బి.పి. ఈయనకు ఎందుకు పెరిగిందీ? అంతగా టెన్షన్స్ ఏమున్నయి" అంటు రావు మఠోసారి, స్టెతస్కోపు ఎదమీదుంచి, పల్స్ రేటును పరిశీలించి పెదవి విరుచుతు.

ఓ మత్తు ఇంజక్షన్ ఇవ్వమని నర్సుకు సైగ చేసాడు రోగి వైపు చూస్తు. "ఏంగాదు మందులు రాస్తం తెచ్చుకోండి" అంటు మంచానికి వేలాడతీసిన కేసు షీటును తీసుకొని రోగ లక్షణాలు వాటికి కావల్సిన మందులు రాస్తు "మన దగ్గర వున్న మందులు ఇవ్వండి లేనివి తెచ్చుకొమ్మనండి" అంటు కేసు షీట్‌ను నర్సు చేతికిచ్చి, అక్కడినుండి కదులుతు వెనకవున్న టీమ్‌వైపు మళ్లీ చూస్తు "ఈయనను ఈయన కొచ్చిన జబ్బును గురించి రోజు ఎగ్జామ్ చేస్తూ వుండండి. మరీ బి.పి. ఎక్కువయితె ఏం జరుగుతదో మీకు తెలుసుగా. పూర్‌ఫెలో ఈయన్ను మనం బతికించుకోవాలి. ముందు బి.పి. కంట్రోల్ కావాలి" అంటు వార్డు బయటికి నడిచాడు. మిగతా డాక్టర్లు ఓపి వైపు నడిచారు. సరిగ్గా అప్పుడే మెడికల్ వార్డులో గొల్లుమని ఏడుపులు వినిపించాయి. ఎవరో పోయినట్టుంది. అదే విషయాన్ని ఎదురొచ్చిన వార్డ్ బోయ్‌ను అడిగితె ఓ రైతు పురుగుల మందు తాగిండట. నిన్న శరీకై ఇయాళ చనిపోయాడు. అంటు స్టోర్ రూమ్‌వైపు నడిచాడు. అది విన్న మనస్సులో శీను ఏదో కీడు చోటు చేసుకున్నట్టు అనిపించింది.

0 0 0

శీను రోడ్డు మీదికొచ్చి నిలుచున్నాడు. అక్కడినుండి ఓ ఊరేగింపు పోతువుంది. "వుయి వాంట్ సపరేట్ తెలంగాణ" అంటూ నినాదాలు చేస్తున్నారు. శీను ఓసారి తెలంగాణ గురించి ఆలోచించసాగాడు. అవును ఈ తెలంగాణ భూబాగమంతా రాళ్లు, రప్పలు, గుండ్లు – ఏనెలు వున్న చిన్నపాటి నదుల్లో

ఎప్పుడు నీరు పారదు. సాగునీరు-త్రాగునీరుకు కష్టమే. బోరునీటిలో బావినీటిలో ఫ్లోరిన్ ఎక్కువ. అందువల్లా కాళ్లు వంకరపోయి, పళ్లు గారపట్టి వుంటాయి. ఇక ఆంధ్రాలో తుఫాన్ వస్తే తెలంగాణలో వర్షాలు. ఎప్పుడు తెలుగు గడ్డపకో పార్శ్వపు నొప్పి. ముఖ్యంగా తెలంగాణలో ఏ సంవత్సరము వరుసగా వర్షాలుండవు. పంటలు పండవు ఏటేట కరువె. భూములు అన్నీ గడ్డి కంచెలుగా మారిపోతువున్నాయి. గ్రామాలలో పంటలు లేకపోయినా పట్టణాలలో పెద్ద పెద్ద ఆసుపత్రులు వెలుస్తున్నాయి. మనిషితో మనిషి మాట్లాడేది రోజు రోజుకు తగ్గిపోతువుంది. అనుకుంటు నడుస్తున్నప్పుడు తమ ఊరి వ్యక్తి 'ఈ టౌనులోనే వుంటున్న' అని మొన్న పండుగకు వచ్చినపుడు చెప్పాడు కాని ఏ ఆఫీసు ఏ బజారు అని అడగలేదు. రోడ్డు మీద ఎక్కడన్న ఎదురైతాడో ఏమో అని చూస్తు వున్నాడు. కాని అతను కనిపించలేదు. అప్పుడె ఏవో నినాదాలు ఇస్తు జై కొడుతు ఓ విద్యార్థుల గుంపు ముందు నుండి పోయింది.

చేసేది లేక తమ ఊరి బస్సెక్కాడు. బస్సులో కూర్చున్నాడే కాని మనస్సులో తండ్రి గురించే ఆలోచనలు కదిలినయి. నాన్న మందులు అందక చనిపోతె. ఒక్కసారె సీను కళ్లల్లో నీళ్లు తిరిగినయి. ఇంకా ఈ విషయాన్ని తన చెల్లెలి ఊరికి చెప్పంపనేలేదు దానికి తెలిస్తే నెత్తి నోరు కొట్టుకుంటువస్తది. కట్నం ఎక్కువ లేదని నీ తల్లిగారింటికి వెళ్లి తీసుకరమ్మని వేదిస్తు వుంటె భర్తతో వేగలేకపోతువుంది. మాట మాటకు చంపేస్త అంటాడట. నిజంగ దాన్ని ఎప్పుడు చంపేస్తడో వాడొట్టి మూర్ఖుడు. చెపితె వినే రకం కాదు. ఓ బిడ్డకు తండ్రై వానికి ఇంకా తెలిసిరాలేదు. రేపు ఎవరినన్న పంపాలె, అనుకుంటు వుండగ బస్సు ఊరు చేరింది. బస్సు దిగి ఊళ్లోకి నడుస్తుంటె ఎదురొచ్చిన ప్రతి వ్యక్తి శీనును ఆపి మరీ మరీ రాములుకు ఎట్లుంది. అని అడిగి తెలుసుకుంటువున్నారు. "స్పృహ వచ్చింది మనుషుల వైపు చూసి గుర్తుపడుతున్నాడు. మాట్లాడే ప్రయత్నం చేస్తువున్నాడు. అని చెపుతు ఇంటివైపు నడుస్తున్నాడు.

"ఏం రోగమని చెప్పిండ్ర బిడ్డ" అంది పక్కింటి సీతమ్మ.

"ఏం రోగమైంది చెపుతారె పెద్దమ్మ. మొత్తం మీద రక్తం వుండవలసినంత లేదట. బి.పి. ఎక్కువుందట. దాని వల్ల కళ్లు తిరగడం, నిలబడలేకపోవటం అట తగ్గడానికి మందులిస్తుండ్రు. నేను పైసలకోసం వచ్చిన" అన్నాడు శీను. అందరు అడుగుతు వుంటె తండ్రికి వచ్చిన ఆపద గుర్తొచ్చి కన్నీళ్ళొస్తున్నాయి

శీనుకు.

"పైసలు కావద్దు మరి, రోగం ఊర్కే వస్తె మందులు ఊర్కే వస్తయా" అంటు ఆమె కదులుతు "నిన్న ఆకిలి ఊకి చల్లిన బిడ్డ ఈ రోజు చేతకాలేదు ఒక్క రోజుకే పడావాబడ్డట్టు అయింది" అంది ఆమె డెబ్బదేండ్ల వృద్ధురాలు.

"గడ్డిని బండిలో ఎస్తింగద, అందుకె అట్ల అయి వుంటది" అనుకుంటు ఇంటి తాళం తీసి లోనికి నడిచి, దీపం ముట్టించాడు. అప్పటి వరకు అటు ఇటు తిరిగిన ఎలుకలు చూరులోకి చేరినయి.

ఆ రాత్రి పక్కింటి పెద్దమ్మ అన్నం తెస్తే తిని, బయటి అరుగుమీద కూర్చోని చాల సేపటి వరకు అడిగిన వాళ్లకు దావఖాన సంగతులు చెప్పి బయట పందిట్లో మంచం వాల్చుకుని పడుకున్నాడు. కాని నిద్ర పట్టడం లేదు. మధ్యరాత్రి దాటింది. మాటి మాటికి తండ్రే గుర్తొస్తున్నాడు. 'తనకు పాతికేండ్లు వచ్చే ఏం పని చేసేటట్టు లేకపాయె. తండ్రికి సహాయం చేయండ తప్పా. అటు చదువు పూర్తికాగ కుటుంబానికి అక్కరొచ్చేటట్టు లేదాయె. ఇటు వ్యవసాయపు పనులు పూర్తిగా రావాయె. అనుకుంటు పక్కకు చూసాడు. మేకపిల్లల ముందు ఆకు – కాయలు లేక పోవడం వల్లా పొద్దంతా తిరిగి తినొచ్చిన దానినే నెమరువేస్తు పందిరి గుంజచుట్టు కునుకు తీస్తువున్నాయి. అమ్మ రోజు కల్లాపు చల్లేది. మేక ఉచ్చ వాసన వొచ్చేది కాదు. ఈ రోజు మేకల ఉచ్చ కంపు వొస్తువుంది. తన తండ్రి గురించి, తన గురించి ఆలోచిస్తు పక్కకు వత్తిగిల్ల పడుకుని రేపు ఎవరెవరిని అప్పు అడగాలనో తలచుకుంటు నిద్రలోకి పోయాడు.

మరునాడు పొద్దున్నే లేచి తన తండ్రికి తెల్సిన వాళ్లను అప్పు అడిగి చూసాడు. ఆ తరువాత తనకు తెలిసినోళ్లను అడిగి చూసాడు. ఫలితం లేకపోయింది. 'మందులకు డబ్బులు కావాలి. లేకపోతే కష్టం నాన్న బతకాలె కని పెంచాడె తప్ప ఆయన తన కష్టం అనుభవించలేదు. నా చదువుల కోసం నానా తిప్పల బడ్డాడు. ఇప్పుడు చదువు వున్న వాళ్లకె ఉద్యోగం అందుబాటులో లేదు. అందుకే పట్టణంలో చదవలేక ఊళ్లో వున్న పదో తరగతి వరకు చదివి ఆపితి ఇక ఆ పనికి ఈ పనికి పోకతప్పటంలేదు. ఏరోజుకారోజు కూలి గింజలు. గంజి మెతుకులు.

పొద్దు నెత్తికొచ్చె వరకు తిరిగాడు. పైకం దొరకలేదు. చివరికి ఉన్న ఐదు ఎకరాల చెల్క గుడ్డాన్ని అమ్మకానికి పెట్టినా అడిగినా అందరు అప్పటికప్పుడె డబ్బులు ఎట్లా వస్తాయి చూద్దాం చేద్దాం అంటు వున్నారు. ఆ

మాటలు అవసరంలో వున్న శీను మనస్సుకు ఎక్కడంలేదు.

"అందులో ఏం పంట పండుతది అన్నారు కొందరు. పనికొచ్చేదైతె ఎందుకు అమ్ముతరు అని మరికొందరు అన్నరు. ఎట్లయితేనేమి రెండు వేల రూపాయలకు ఎకరం చొప్పున ఐదెకరాలకు పదివేలు ధర ఖరారైంది. భూమిని అమ్మే విషయం అమ్మా నాన్నకు చెప్పలేదు. డబ్బు కావాలి లేకపోతె నాన్న బతకడు. మాట ముచ్చట అయినా 'మీ నాన్నను అడగకపోతె ఎట్లా'? అన్నారు మళ్లీ మొదటికొచ్చిన బేరం శీనయ్యను చతికిల పడేసింది.

వట్టి చేతులతో ఇంటికొచ్చేసరికి పందిరి గుంజలకున్న మేక దాని రెండు పోతులు శీనును చూసి అరిచినయి. చేసేది లేక వెంటనే వాటిని పట్టుకెళ్లి కటివానికి అమ్మి పైకాన్ని తీసుకుని దావఖానకు బయలుదేరాడు శీను.

రాత్రంతా నడిచి తెల్లారెవరకు దావఖానకు చేరాడు. దావఖాన వెనకాల వున్న పీనిగెల గదిముందు తల్లి నెత్తి నోరు కొట్టుకుంటు రోదిస్తుంది. గేటు లోపలికి వస్తు వుంటె ఆ శోక తరంగాలు తన శరీరంలోకి చొచ్చుకొని పోయి నిలువెల్ల వనికించినయి. ఏడుపు చప్పుడు విని అటు వైపు నడిచాడు గొంతు మూగపోయింది. కనుగుడ్ల చుట్టు కన్నీరు తన్నుకొచ్చి చూపు మసకబారింది. సూర్యుని కిరణాల మధ్య తన తల్లి శోకమూర్తి అయి నిలుచుంది. తన్నుకొస్తున్న దుఃఖానికి చేతులు అడ్డం పెట్టుకొని తల్లి ఎదమీద తల వుంచి ఏడుస్తు వున్నాడు. చుట్టూర జనం ఎవరి పనుల్లో వాళ్లు కదులుతువున్నరు.

గేటు కెదురుగ వున్న ఓ పెద్ద బోర్డు మీద నాగలి పట్టిన రైతు బొమ్మ!

• మే 2003.